సైబర్ వలలో విలవిల..

పెరిగిపోతున్న ఆన్‌లైన్ నేరాలు

- టెక్నాలజీని వినియోగించుకుని మోసం
- ఖాతాల నుంచి క్షణాల్లో మాయవుతున్న నగదు
- బలవుతున్న అమాయకులు, సామాన్యులు



అత్యాశే ఆసరాగా..

మణుగూరు టౌన్: ఆన్‌లైన్ సాంకేతికతను ఆధారంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు పేట్రేగిపోతున్నారు. అమాయకులు, మహిళలు, టెక్నాలజీపై అవగాహన ఉన్న వారిని సైతం బురిడి కొట్టిస్తూ రోజుకో తరహాలో మోసాలకు పాల్పడుతున్నారు. ఏ మాత్రం అవకాశం దొరికినా ఖాతాలను ఖాళీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. కేవలం నిరక్షరాస్యులే కాదు సామాన్యులు, విద్యావంతులు సైతం ఈ మోసాలకు బలై బాధితులుగా మారుతున్నారు. టెక్నాలజీని అత్యాశను వలగా వేసి క్షణాల్లో లక్షల సొమ్మును ఖాళీ చేస్తున్న తీరును అర్థం చేసుకోవచ్చు. కేవలం నాలుగు నెలల్లో మణుగూరు నుంచి దాదాపు 20 కేసులు నమోదు కావడం సైబర్ నేరాల ప్రభావం ఏజెన్సీ ఏరియాలను చుట్టిముట్టాయన్న డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. ప్రజలను, విద్యార్థులను అప్రమత్తం చేస్తున్నా సైబర్ నేరాలపై స్పందించకుండా ఉండాలని పోలీసులు పదే పదే సూచిస్తూ అవగాహన కల్పిస్తున్నా లక్షలాది రూపాయలను పోగొట్టుకుని విలవిల్లాడటం విస్మయాన్ని కలిగిస్తోంది.

కొద్దిపాటి పెట్టుబడికి భారీ రాబడిలు అంటూ వచ్చే ప్రకటనలకు ఆశపడి వివరాలు నమోదు లేదా శ్రమ లేకుండా కొంత పెట్టుబడికి రెట్టింపు ఆదాయం, బ్యాంక్ ఖాతా వివరాల నమోదు లింక్స్, లోన్ యాప్స్ ఇలాంటి ఆకట్టుకునే అదనపు ఆదాయాన్ని సృష్టించి చెప్పే తీయని మాటలకు లొంగి పెట్టుబడులు పెడుతూ అపరిచిత లింక్స్‌ను క్లిక్ చేస్తూ సైబర్ నేర సామ్రాజ్యంలో బానిసలుగా మారుతున్నారు. కొందరు తేరుకుని సైబర్ క్రైం నేరాల నియంత్రణకు ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ సైబర్ కమాండ్ కంట్రోల్ సెంటర్(1930)కు ఫిర్యాదు చేసి నష్ట నివారణకు చర్యలు తీసుకుంటున్నారు. మరికొందరు అష్టకష్టాలు పడి సంపాదించుకుని దాచుకున్న డబ్బులు సైబర్ నేరగాళ్ల పాలై ఎవరికి చెప్పుకోలేక సమాజంలో చిన్నతనంగా భావిస్తూ మిన్నకుంటున్నారు.

అప్రమత్తతే రక్షణ...

టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో కొత్త దారులు వెతుక్కుంటున్న సైబర్ కేటుగాళ్ల పట్ల అప్రమత్తతే ప్రధానం అంటూ పోలీసులు సూచిస్తున్నారు. ముందుగా కొంత పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బులు వస్తాయని ప్రారంభించి, విచిత్రమైన యాపుల్లో అధిక మొత్తంలో డబ్బులు పెట్టుబడి పెట్టించడం లేదా మీ బ్యాంక్ వివరాలు నమోదు చేయాలి ఓటీపీ తదితర వివరాలు అడగటం అవగాహన లోపంతో చెప్పడం. ఇలా ఈజీ మనీ కోసం పాకులాడే వారు టార్గెట్‌గా జరుగుతున్న వాటికి స్పందించకపోవడమే ఉత్తమని సూచిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- డెబిట్, క్రెడిట్ కార్డ్స్, యూపీఐ పిన్, పాస్‌వర్డ్స్, ఓటీపీలు, సీవీవీ నంబర్లను ఏ బ్యాంక్ అధికారి అడగరని ప్రజలు గమనించాలి. బ్యాంక్ అధికారుల మంటూ వచ్చే ఫోన్‌కాల్స్‌కి స్పందించొద్దు.
- అపరిచితుల నుంచి వచ్చే ఆఫర్లు, లాటరీలు, డిస్కౌంట్లను నమ్మొద్దు. ఊరికే ఎవరూ బహుమతులు ఇవ్వరు. డబ్బులు పంపరు.
- అనుమానాస్పదంగా ఉండే లింక్‌లు ఓపెన్ చేయకపోవడమే మంచిది.
- చెక్‌బుక్, కేవైసీ పత్రాల కాపీలను అపరిచితులతో పంచుకోవద్దు.
- ఆన్‌లైన్‌లో అప్పులిస్తామనే యాప్‌లకు దూరంగా ఉండాలి.
- లాటరీ వచ్చింది కొంత నగదును డిపాజిట్ చేయాలంటే నమ్మొద్దు.
- ఆన్‌లైన్ వస్తువుల కొనుగోలు సమయంలో నమ్మకమైన యాప్‌లనే ఆశ్రయించాలి.

అప్రమత్తంగా ఉండాలి



బ్యాంక్ అధికారులమని వచ్చే ఫోన్లకు స్పందించడం, అపరిచిత ఆన్‌లైన్ లింక్‌లు క్లిక్ చేసి వివరాలు నమోదు చేయడం లాంటివి చేయొద్దు. లాటరీ తగిలింది, పెట్టుబడి పెడితే రెట్టింపు రాబడి వంటి మెసేజ్‌లకు స్పందించి జీవితాలను చిన్నాభిన్నం చేసుకోవద్దు. ఎవరైనా సైబర్ క్రైం బారిన పడితే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి.

– సతీష్‌కుమార్, సీఐ, మణుగూరు

మణుగూరులో కొన్ని ఘటనలు..

● ట్రేడింగ్ యాప్‌లో..

మణుగూరులో ఓ బ్యాంక్‌లో పనిచేసే ఉద్యోగి ట్రేడింగ్ యాప్ ద్వారా అధిక ఆదాయం సంపాదించాలని ఆశతో రూ.10వేలు పెట్టుబడి పెట్టగా, 20 వేలు అలా విడుతల వారీగా పెంచుకుంటూ స్నేహితుల వద్ద అప్పుగా తీసుకుని రూ.45 లక్షలు పెట్టుబడి పెట్టి పూర్తిగా డబ్బులు పోగొట్టుకున్నాడు.

● పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని..

బాంబేకాలనీకి చెందిన ఓ ఉద్యోగికి ముంబై సిటీ కస్టమ్స్ కమిషనర్‌ని మాట్లాడుతున్నానని వారికి వచ్చిన పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని వీడియో కాల్‌లో పోలీస్ దుస్తులు ధరించి మాట్లాడటంతో భయపడిన ఆ కుటుంబ సభ్యులు వారు సూచించిన అకౌంట్‌కి రూ.3.50 లక్షలు బదిలీ చేశారు. అనుమానం వచ్చి ఆలస్యంగా స్థానిక పోలీసులను సంప్రదించడంతో సైబర్ అధికారుల సాయంతో అకౌంట్‌ను హోల్డ్ చేయించి రూ.35 వేలు మాత్రమే రికవరీ చేయగలిగారు.

● సర్వే పేరుతో..

తెలంగాణ రాష్ట్ర కుటుంబ సర్వే జరుగుతోంది. అంటూ ఫోన్ చేసి వివరాలు సేకరించిన ఓ అపరిచిత వ్యక్తికి ఓటీపీ చెప్పిన మణుగూరుకు చెందిన వ్యక్తి తన బ్యాంక్ ఖాతా నుంచి రూ.2.82లక్షలు కోల్పోయాడు. ఉన్నఫలంగా ఖాళీ అయిన ఖాతా చూసి అనుమానం వచ్చిన బాధితుడు పోలీసులను ఆశ్రయించగా, సైబర్ క్రైం అధికారుల సాయంతో రూ.82 వేలు మాత్రం ఇప్పించగలిగారు.

● పార్ట్‌టైం జాబ్ ఆశచూపి..

మణుగూరుకు చెందిన ఓ మహిళ టెలిగ్రాం యాప్ ద్వారా పార్ట్‌టైం జాబ్ చేస్తూ 'యాత్ర'లో విమాన టికెట్‌లు బుక్ చేస్తే కొంత మొత్తంలో అదనంగా డబ్బులు వస్తాయని ఇందుకు తొలుత కొంత పెట్టుబడి పెట్టాలనే ప్రకటనకు ఆకర్షితురాలైంది. రూ.10 వేల డిపాజిట్‌కి రూ.9,750 రావడంతో రెండోసారి రూ.50 వేలు పెట్టగా రూ.38వేలు లాభం పొందింది. విడతల వారీగా రూ.12.11 లక్షలు డిపాజిట్ చేస్తే రూ.43 లక్షలు వస్తాయని నమ్మబలకడంతో ఐదు రోజుల వ్యవధిలోనే పెట్టుబడి పెట్టగా ఆ మొత్తం పోయాయి. దీంతో 1930 కు ఫిర్యాదు చేయగా, వెంటనే స్పందించిన సైబర్ క్రైం పోలీసులు రూ.6 లక్షలు తిరిగి అప్పగించారు.

● యోనో యాప్ బ్లాక్ అయ్యిందని..

ఎస్‌బీఐ, యోనో యాప్‌లో మీ అకౌంట్ బ్లాక్ అయింది అనే మెసేజ్ ఫోన్‌కి రావడంతో మణుగూరుకు చెందిన బీటెక్ చదువుతున్న యువకుడు మెసేజ్‌తో వచ్చిన 'ఏపీకే' ఫైల్‌లో వివరాలు అప్‌లోడ్ చేశాడు. ఓటీపీ చెప్పాలని వచ్చిన ఫోన్ కాల్‌కి స్పందించి అకౌంట్‌లో ఉన్న రూ.7.50 లక్షలు క్షణాల్లో మాయమయ్యాయి. ఖంగుతిన్న యువకుడు మణుగూరు పోలీసులను సంప్రదించి 1930కి ఫిర్యాదు చేయడంతో అకౌంట్‌ని హోల్డ్ చేసి రూ.1,72,550 నగదు ఇప్పించగలిగారు.



యువకుడికి వచ్చిన ఫేక్ లింక్

క్లుప్తంగా

మంగళ సూత్రాల బహూకరణ



మంగళసూత్రాలు అందజేస్తున్న దాతలు

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాలలో గల శ్రీ సీతారామచంద్రస్వామి వారికి భద్రాచలానికి చెందిన భక్తులు మంగళసూత్రాలు బుధవారం బహూకరించారు. పిన్నింటి రాజశేఖర్ కమల దంపతులు 4 గ్రాముల రెండు బంగారు సూత్రాలు, భద్రాచలంకు చెందిన మహిళా బృందం 4 గ్రాముల మూడు బంగారు మంగళ సూత్రాలను అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, భార్గవా చార్యులు, నరసింహాచార్యులు సమక్షంతో ఆలయ ఇన్‌చార్జ్ అనీల్‌కు అందజేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

భద్రాచలంటౌన్: పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో పునర్నిర్మిస్తున్న వెంకటేశ్వర స్వామివారి ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన ఎన్ఆర్ఐ దంపతులు డాక్టర్ గోళ్ల వరుణ్‌కుమార్, సౌమ్య రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈ మేరకు కమిటీ సభ్యులకు కుటుంబ సభ్యులు బుధవారం చెక్కు అందజేశారు.

న్యాయమూర్తికి అభినందనలు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఫస్ట్‌క్లాస్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వి.శివనాయక్‌కు బుధవారం బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను పూలమాలతో సత్కరించి, శాలువతో సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం, న్యాయవాదులు ఉన్నారు.

అన్నదానం

భద్రాచలంటౌన్: పట్టణంలోని భద్రాద్రి హరిహర క్షేత్రం శ్రీఅయ్యప్ప స్వామివారి దేవాలయంలో బుధవారం అయ్యప్ప మాల ధారులు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు పట్టణానికి చెందిన గంటాల నరసింహారావు-సత్యవతి దంపతులు, వారి కుమారులు సురేష్, వేణుల సహకారంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

హామీలు అమలు చేయాలి

ములకలపల్లి: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలైన ఆరుగ్యారంటీలను వెంటనే అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం పాల్వంచ డివిజన్ కార్యదర్శి పోతుగంటి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన సంఘ మండలకమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్వరమే హామీల అమలుకు చిత్తశుద్ధితో కృషిచేయాలన్నారు. సంఘ మండల కార్యదర్శి శాస్త్రబోయిన వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచే బలోపేతం చేయాలి

మణుగూరు రూరల్ : గ్రామస్థాయి నుంచి బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ముత్యాలమ్మనగర్ గ్రామంలో జరిగిన గ్రామస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో సైనికుల్లా పనిచేయాలన్నారు. మండల కో కన్వీనర్ బొలిశెట్టి నవీన్, పట్టణ కన్వీనర్ కుంటా లక్ష్మణ్, కో కన్వీనర్ నూకారపు రమేష్, నాయకులు వట్టం రాబాబు, ముద్దంగుల కృష్ణ, రామకోటి, మాజీ సర్పంచ్ కొమరం జంపేశ్వరి, జావీద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

దమ్మపేట: వ్యవసాయ కార్మికులకు జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. బుధవారం మండలంలోని జమేదారు బంజర, గుర్వాయిగూడెం గ్రామాల్లో వ్యవసాయ కార్మికుల సమావేశం నిర్వహించారు. నాయకులు అమర్లపూడి రాము, గోకినపల్లి ప్రభాకర్, భాస్కర్, కుర్సం ముత్యాలరావు, రాముడు, వీరబాబు, మహేష్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

నాన్‌టీచింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

అశ్వారావుపేటరూరల్: విశ్వ విద్యాలయాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్‌ను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ కోరారు. బుధవారం స్థానిక వ్యవసాయ కళాశాల వద్ద టైం స్కేల్, కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతరం నూతన కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకన్నారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఉమామహేష్, సాలార్, కోశాధికారిగా ఇస్మాయిల్‌ను ఎన్నికై నట్లు తెలిపారు. అమీర్, కృష్ణ, ఆశా, రమణ, నాగేశ్వరరావు ఉన్నారు.

'ప్రభుత్వ తప్పుడు విధానాలతోనే లగచర్ల ఘటన'



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

భద్రాచలంటౌన్: భూమి పోతుందన్న భయంతో రైతులు ఆందోళన చేస్తే కావాలని ప్రభుత్వం కుట్రతో దాడిగా చిత్రీకరించి అమాయక రైతులపై కేసులు మోపుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినే సుదర్శన్‌రావు ఆరోపించారు. స్థానిక గుప్త ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జరిగిన 8వ పట్టణ మహాసభకు ఆయన మాట్లాడారు. మణిపూర్‌లో సంవత్సర కాలంగా మారణహోమం జరుగుతుంటే స్పందించని మోదీ రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపుతామని ప్రలాభాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దొందు దొందే అన్న విధంగా ప్రజా వ్యతిరేక విధానాలతో పరిపాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. దేశవ్యాప్తంగా పార్టీ మహాసభలు స్ఫూర్తిదాయకంగా కొనసాగుతున్నాయని, ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలపై మహాసభలలో పోరాటాలను రూపొందించుకుంటున్నామన్నారు. ముందుగా అమర వీరుల స్తూపం వద్ద పార్టీ శ్రేణులు నివాళులర్పించి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మిడియం బాబురావు, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, శరత్ బాబు, సున్నం గంగ, ఎంబీ నర్సారెడ్డి, యలమంచి రవికుమార్, కారం పుల్లయ్య, బ్రహ్మాచారి, గడ్డం స్వామి, వెంకట రామారావు, సంతోష్ కుమార్, నాదెల లీలావతి, సీతాలక్ష్మి, మాధవరావు, కుసుమ, శ్రీనివాస్, లక్ష్మీకాంత్, శ్రీను, నాగరాజు, భూపేంద్ర, సతీష్ బాబు, ఝాన్సీ, కనక శ్రీ, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు

పత్తిపంటకు మద్దతు ధర ఇవ్వాలి

చండ్రుగొండ : పత్తి పంటకు మద్దతు ధర కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రం చండ్రుగొండలో ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన మండలశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు కొండపల్లి శ్రీధర్, ఐలూరి రామిరెడ్డి, పెద్దిని వేణు, కాక సీత, ఆర్ వెంకటాచారి, గాలి రామారావు, గోగుల తిరుపతిరావు, మిర్యాల మోహన్‌రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

గుండాల: రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 9న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్రసదస్సును జయప్రదం చేయాలని రైతు కూలి పోరాట సమితి నాయకులు మోకాళ్ల సమ్మయ్య పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో బుధవారం కరపత్రాలను రైతు కూలీ పోరాట సమితి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ కకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి దాదాపు సంవత్సరం కావస్తున్నా పూర్తి స్థాయిలో చేయలేదన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు ఈసం కృష్ణన్న, ముక్తి సత్యం, ఈసం పాపారావు, గుంపిడి వెంకటేశ్వర్లు, కొమరం శాంతయ్య, చంద్రయ్య దొర, సాగరన్న, ఉదయ్, రమేష్, పునేం శ్రీను, వీరస్వామి, సోలం సతీష్ పాల్గొన్నారు.

విద్య, క్రీడలపై మొగ్గుచూపాలి



కిట్లు అందజేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

పినపాక: యువత అసాంఘిక శక్తులకు దూరంగా ఉండి, విద్య, క్రీడల వైపు మొగ్గు చూపాలని ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. మండల పరిధిలోని మొద్దులగూడెం, తిర్లాపురం గ్రామాలకు చెందిన ఆదివాసీ యువకులకు బుధవారం ఎస్సై రాజ్ కుమార్‌తో కలిసి వాలీబాల్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అనుమానంగా ఎవరైనా సంచరిస్తే సమాచారం అందించాలని, చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉపాధిపై దృష్టి సారించాలన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం



కరకగూడెం: మాట్లాడుతున్న ఎస్సై రాజేందర్

కరకగూడెం: మత్తు పదార్థాలకు ఎవ్వరూ బానిస కావొద్దని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ఉండాలని ఎస్సై రాజేందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని భట్టుపల్లి జెడ్పీ పాఠశాలలో 'మత్తు పదార్థాల నివారణ'పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మోహన్ బాబు, ఉపాధ్యాయ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై కిన్నెర రాజశేఖర్ సూచించారు. మండలపరిధిలోని రేగులకుంట గ్రామంలో బుధవారం గంజాయి, తదితర మాదక ద్రవ్యాల నిర్మూలనపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం ఇరవై మంది వృద్ధులకు రగ్గులను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ కారం సుధీర్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం



జాన్‌ను సన్మానిస్తున్న కార్మికులు

మణుగూరు రూరల్ : ఐఎన్‌టీయూసీ అనుబంధ సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ లేబర్ యూనియన్ ఏరియా అధ్యక్షుడిగా నియమితులైన వెలగపల్లి జాన్‌ను పీకేఓసీ 2 కార్మికులు, నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఫిట్ సెక్రటరీ రాంశెట్టికృష్ణ చేతన్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ కోడి శివకుమార్, జీవరత్నం, బోగా రాజలింగు, భానుచందర్, గణేష్, మహేందర్, శ్రీధర్, శ్రీనివాస్, చక్రపాణి, శ్రీనివాస్, భరత్, అనిల్, శ్రావణ్, వినయ్ పాల్గొన్నారు.

లక్ష్యాన్ని పూర్తి చేయాలి

ములకలపల్లి: బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని కచ్చితంగా పూర్తి చేయాలని ఓబీసీ నాయకులు జటంగి కృష్ణ సూచించారు. సభ్యత్వ నమోదుపై ములకలపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రతీ పోలింగ్ బూత్‌లో సభ్యత్వాలు నమోదు చేయాలని, అదేవిధంగా నూతన బూత్‌కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు గుగులోతు శంకర్ నాయక్, పూనెం నవీన్, పాలకుర్తి ప్రసాద్, కోటోజు రాంబాబు, బాణోతు మల్లేశ్, జర్పుల శివ తదితరులు పాల్గొన్నారు.

నట్టల మందు పంపిణీ

పినపాక: మండల పరిధిలోని పాత రెడ్డిపాలెం గ్రామంలో బుధవారం పశువైద్యశిబిరం ఏర్పాటుచేసి పాడి రైతులకు పశువైద్యాధికారిని ఉజ్వల నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కరగడం వైద్యాధికారిని వసంతి, గోపాలమిత్ర లక్ష్మణరావు, రామ్మోహన్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

క్రీడా వస్తువుల వితరణ



క్రీడా సామగ్రితో విద్యార్థులు

దమ్మపేట: ఉమ్మడి ఖమ్మం, నల్గొండ జిల్లాల లయన్స్ క్లబ్ యూత్ ఎంపవర్‌మెంట్ సౌజన్యంతో స్థానిక జెడ్పీ పాఠశాల క్రీడా వస్తువులను, స్థానిక లయన్స్ క్లబ్ సభ్యులు అందజేశారు. విద్యాకమిటీ చైర్మన్ పాకనాటి శ్రీనివాసరావు, క్లబ్ బాధ్యులు వేణుగోపాల్, పసుమర్తి ముక్తేశ్వరరావు, యుగంధర్, మాధవరావు, వెంకటేశ్వరరావు, సంధ్యారాణి ఉన్నారు.

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక



విద్యార్థికి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే జారె

అశ్వారావుపేటరూరల్: జిల్లా స్థాయిలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన అశ్వారావుపేట జెడ్పీ పాఠశాల విద్యార్థి ఆర్.సాయికౌశిక్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం హరిత తెలిపారు. ఈ మేరకు సదరు విద్యార్థిని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఎంఈఓ ప్రసాద్‌రావు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.



జ్ఞాపిక అందుకుంటున్న ప్రణీత్

ములకలపల్లి: మండలపరిధిలోని జగన్నాథపురం హైస్కూల్ విద్యార్థి ఇనుకుర్తి ప్రణీత్ అన్నపురెడ్డిపల్లిలో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ కనబర్చి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసాపత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ఎంఈఓ సత్యనారాయణ, ఉపాధ్యాయబృందం అభినందించారు.

నేడు మండలస్థాయి చెకుముకి పోటీలు

మణుగూరు రూరల్ : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పోటీలను నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ మీరాహుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల స్థాయిలో గెలుపొందిన మండలంలోని అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు విద్యార్థులను పోటీలకు సంసిద్ధం చేయాలని తెలిపారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



సైకిళ్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ సతీష్‌కుమార్

బూర్గంపాడు: రోటరీ క్లబ్ ఆఫ్ రివర్ సైడ్ సేవలు అభినందనీయమని పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. అదే విధంగా రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ సహకారంతో గ్రామంలోని ఐదుగురు నిరుపేదలకు తోపుడుబండ్లను అందించారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సహకారంతో ఐదుగురు వికలాంగులకు వీల్ చైర్స్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్(ఫాస్ట్) బూసిరెడ్డి శంకర్‌రెడ్డి, క్లబ్ చైర్మన్ డాక్టర్ మడిపెద్ది రమేష్, పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, బూర్గంపాడు ఎస్సై రాజేష్, ప్రోగ్రాం చైర్మన్ బాచిన రామకృష్ణ, క్లబ్ కార్యదర్శి గంజి సంపత్, కోశాధికారి ధనకొండ రాఘవయ్య, మండల విద్యాశాఖ అధికారి యదుసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

బూర్గంపాడు: మండల పరిధిలోని కోయగూడెం గ్రామానికి చెందిన పాయం రాజేంద్రప్రసాద్ రచించిన కోయ 'ఆదివాసీ ప్రాచీన ఆహార సంస్కృతి' పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఝార్ఖండ్ రాష్ట్రంలోని జెంషెడ్‌పూర్‌లో జరుగుతున్న బిర్సా ముండా జయంతి ఉత్సవాల్లో భాగంగా పుస్తకాన్ని టాటా స్టీల్ ఫౌండేషన్ ప్రతినిధులు ఆవిష్కరించారు. టాటా స్టీల్ వైస్ ప్రెసిడెంట్ దీపర్ కపూర్, బోర్డుమెంబర్ చాణక్య చౌదరి, ఫౌండేషన్ సీఈఓ సౌరాయెయ్, జిరరెన్ టిప్సోలు రాజేంద్రప్రసాద్‌ను అభినందించారు.

పార్టీ బలోపేతంలో ముందుండాలి


మణుగూరు రూరల్: సీపీఐ బలోపేతంలో యువజన కార్యకర్తలు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య పిలుపునిచ్చారు. మండలపరిధిలోని మద్దులగూడెం గ్రామంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు, ఏఐటీయూసీ మండల కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, నాయకులు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, రాములు ఉన్నారు.

చర్ల: పేదల పక్షాన నిలబడేది సీపీఐయేనని పార్టీ డివిజన్ కార్యదర్శి, రాష్ట్ర సమితి సభ్యులు కల్లూరి వెంకటేశ్వరావు అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యాక్రమాన్ని మండల కేంద్రంలో ప్రారంభించారు. తాతాజీ, ప్రసాద్, సాయి కిరణ్, గంగరాజు, రాంబాబు, మాల్యాద్రి, సాంబశివరావు ఉన్నారు.

బస్సు సర్వీసులు కొనసాగించాలని వినతి

భద్రాచలంటౌన్: భద్రాచలం డిపో నుంచి హైదరాబాద్ నగరంలోని మియాపూర్, కేపీహెచ్‌బీ వరకు గతంలో నడిచిన సర్వీసులను కొనసాగించాలని ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో బుధవారం డీఎం తిరుపతికి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం భద్రాచలం నుంచి హైదరాబాద్ ఎంజీబీఎస్ వరకు మాత్రమే బస్సులు తిరుగుతున్నాయని, దీంతో మళ్లీ నగర శివారు ప్రాంతాలకు వెళ్లాలంటే రవాణా భారం పెరుగుతుందన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలోనే బస్సులు నడిపే విధంగా చర్యలు తీసుకుంటానని డీఎం హామీ ఇచ్చారు. బొక్క రాంబాబు, కనుకు శ్రీను, పున్నయ్య, తోకల దుర్గాప్రసాద్, రామచందర్, పెద్దనరసింహారావు, రామకృష్ణ, మహేష్, సతీష్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం



మాట్లాడుతున్న తాతారావు

చర్ల: రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ దిశగా నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని తిప్పాపురం, పెదమిడసిలేరు గ్రామాల్లో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ మండల కో కన్వీనర్ ఐనవోల్ పవన్‌కుమార్, ఎస్‌డీ.అజీజ్, కాకి అనీల్, మాజీ సర్పంచ్ కారం కన్నారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భద్రగిరికి పాదయాత్ర

ములకలపల్లి: ములకలపల్లికి చెందిన భక్తబృందం బుధవారం భద్రాచలానికి కాలినడకన వెళ్లారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని పలువురు భక్తులు తెల్లవారుజామునే స్థానిక భక్త అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భద్రగిరికి పాదయాత్రగా వెళ్లారు.



భద్రాద్రికి బయల్దేరిన భక్తబృందం